## క్లుప్తంగా

### 1న దెందులూరులో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పర్యటన

దెందులూరు: దెందులూరు గ్రామంలో ఆగస్టు 1న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. దెందులూరు ఎస్సీ ఏరియాలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఎస్సీ ఏరియాలో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వలంటీర్లు విధిగా పాల్గొన్నాలని కామిరెడ్డి కోరారు.

### పేకాట శిబిరాలపై దాడి

నిడమర్రు: మండలంలో రెండు గ్రామాల్లో పేకాట శిబిరాలపై శుక్రవారం రాత్రి నిడమర్రు పోలీసులు దాడిచేసి ఆ శిబిరాల్లోని జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి నగదు సీజ్ చేసినట్లు నిడమర్రు ఎస్సై రమవరపు శ్రీను తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తోకలపల్లి గ్రామం శివారు ఇంటి వద్ద పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు రైడ్ చెయ్యగా ఈ శిబిరంలో 8 మంది పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.71 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పెదనింద్రకొలను శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,500 నగదు జప్తు చేసి నిందితులను తాడేపల్లిగూడెం కోర్టుకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నిడమర్రు ఎస్సై రవివరపు శ్రీను మాట్లాడుతూ గ్రామాల్లోని శివారు ప్రాంతాల నివాసాల్లో, చేపల చెరువులపై పేకాట ఆడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వారు తక్షణం వాటికి దూరంగా ఉండాలన్నారు. ఆయా శిబిరాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### డాక్టర్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

ఏలూరు టౌన్ : అధికంగా డబ్బులు వసూలుపై ప్రశ్నించటంతో ఏలూరు ఎన్ఆర్ పేటలోని ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రోగి భర్త, బంధువులు ఆందోళన చేశారు. తన భార్య వ్యక్తిత్వాన్ని కించపరిచేలా తీవ్ర పదజాలంతో దూషించటంపై భర్తతోపాటు, బంధువులంతా హాస్పిటల్ మెట్లపై బైఠాయించారు. భారీగా డబ్బులు వసూలు చేస్తూ రోగుల కుటుంబాలతో ఆడుకుంటున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల కథనం మేరకు.. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన ఆలంపల్లి రాజు తన భార్య కనకదుర్గకు గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉండడంతో ఏలూరు ఎన్ఆర్‌పేటలోని ఓ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు వైద్యం నిమిత్తం మూడు రోజుల క్రితం చేర్పించారు. చికిత్సల నిమిత్తం రూ.48 వేలు ప్యాకేజీ మాట్లాడుకున్నారు. ప్యాకేజీకి మందులకు రూ.10 వేలు, టెస్టులకు మరో రూ.3 వేలు చెల్లించానని తెలిపారు. మరోసారి రూ.2500 చెల్లించాలని సిబ్బంది చెప్పటంతో హాస్పిటల్ ఎండీ వద్దకు వెళ్లగా ఆయన తీవ్రమైన పదజాలంతో తనను, తన భార్య వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఐసీయూలోని తన భార్యపై నీచమైన రీతిలో మాట్లాడుతూ నన్ను దూషించారని ఆమె భర్త రాజు వివరించారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ఫోన్ కట్‌చేసిన ఎండీ**

ఇదే విషయంపై హాస్పిటల్ ఎండీని ఫోన్‌లో వివరణ కోరగా ఆయన సమాధానం చెప్పేందుకు నిరాకరించారు. ఏమీ కాలేదంటూ ఫోన్ పెట్టేశారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపామని, కేసు లేమీ నమోదు చేయలేదని ఆయన తెలిపారు.

### జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ఎన్‌టీఆర్ నగర్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆదేశాల మేరకు పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నారు.

### మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

ఏలూరు (టూటౌన్): మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మణిపూర్ ఘటనలను నిరసిస్తూ శనివారం ధర్నా చేశారు. మణిపూర్‌లో జరిగిన హత్యలు, అత్యాచారాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేయించాలని కోరారు. ఈ ఘటనలకు కారకులైన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ, నాయకులు చీలి మోహనరావు, బేతాల జయసుధ, మధుమంచి విజయ, లక్కపాము చంటి, పింగుల ఇథియా పాల్గొన్నారు.

# చురుగ్గా డ్రెయిన్ల పూడిక తీత పనులు



లక్ష్మీపురం వద్ద బొబ్బిలిలంక డ్రెయిన్ తవ్వి మట్టి ట్రాక్టర్లతో తరలింపు



బాదంపూడి ఆయకట్టులో తేరుకుంటున్న వరి నాట్లు



రామిలేరు పరివాహక ప్రాంతంలో మునిగిన పొలాలు



రామిలేరులో పేరుకుపోయిన జమ్ము, గుర్రపు డెక్క

భీమడోలు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు దిగువకు ప్రవహిస్తోంది. వరద నీరంతా కొల్లేరు డ్రెయిన్లలోకి చేరి అక్కడ నుంచి కొల్లేరు మేజర్ డ్రెయిన్లకు చేరాల్సి ఉంది. డ్రెయిన్లను ఆక్వా రైతులు ఆక్రమించడంతో పూడిక పోయి నీరు కిందికి దిగని పరిస్థితి ఏర్పడింది. పైగా డ్రెయిన్లు ఎగదన్నుతోంది. దీనితో పంట పొలాలను ముంపు నీటిలో మూడు రోజులుగా తాండవిస్తున్నాయి. నీరంతా పొలాల్లో చౌడు బారిన పడతాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, ఎంఎంపురం గ్రామాలకు చెందిన రైతులకు చెందిన 450 ఎకరాల ముంపుబారిన పడ్డాయి. భీమడోలులోని 130 ఎకరాల్లోని చేరిన ముంపు నీరు కిందకు వెళుతోంది. ఎంఎంపురంలో ముంపు నీరు కిందికి ప్రవహిస్తుంది. ఆగడాలలంక రెవెన్యూ పరిధిలోని లక్ష్మీపురం నుంచి వెళ్లే రెండు కిలోమీటర్ల దూరంగా ప్రధాన డ్రెయిన్ బొబ్బిలిలంక పూడుకుపోవడంతో రెండు రోజులుగా అధికారులు, రైతులు శ్రమించి జేసీబీ సహకారంతో శనివారం కూడా పూడిక తీసే పనిలో నిమగ్నమయ్యారు. గుండుగొలను రెవెన్యూ పరిధిలోని భోగాపురం, వడ్డిగూడెం వద్ద గల ముంపునకు గురైన 250 ఎకరాల్లో నీరు బొబ్బిలిలంక డ్రెయిన్‌ను వరద నీరు కిందకు ప్రవహించాల్సి ఉంది. ఆక్వా యాజమానులు, రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బొబ్బిలిలంక డ్రెయిన్‌ను జేసీబీ సాయంతో పూడిక తీస్తున్నారు. ట్రాక్టర్లలో దూరంగా మట్టిని తరలిస్తున్నారు. మరో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితికి వస్తుందని వీఆర్వో శేషకుమార్ శనివారం తెలిపారు.

**ముంపునీరు తగ్గుముఖం**

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో శని, శుక్ర వారాలు వర్షం లేకపోవడంతో మునిగిపోయిన పంట పొలాలు తేరుకుంటున్నాయి. వారం రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాట్లు వేసిన పంట పొలాలు సుమారు 1,500 ఎకరాలు వరకు నీట మునిగాయి. ముంపు నీరు తగ్గుముఖం పట్టడంతో నాట్లకు ప్రమాదం ఏమీలేదని, వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే నాట్లు తిరిగి కోలుకుంటాయని అధికారులు అంటున్నారు. కైకరం, బాదంపూడి, నాచుగుంట ,రావులపర్రు, బొమ్మిడి, ప్రాంతాల్లో శనివారం వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది.

**రామిలేరు పూడికతో మునుగుతున్న పొలాలు**

పెదపాడు: మండలంలోని రామిలేరులో పూడిక, జంగిల్ తొలగించకపోవడంతో పంట పొలాలతో పాటు, కాలనీలోని ఇళ్లు నీట మునుగుతున్నాయి. పెదపాడు మండలంలో రామిలేరు 10 కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది. కొన్నాళ్లుగా గుర్రపు డెక్క, జమ్ము, కిక్కిస రామిలేరులో విపరీతంగా పేరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం పెరిగింది. ఖాజీగూడెం మొదలుకుని, సత్యవోలు, వసంతవాడ గ్రామాలకు నీరు ఎదురు రావడంతో పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. వీటితో పాటు ఖాజీగూడెంలో కాలనీ ఇళ్ల కూడా జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలకు ఎంతగానో నష్టం వాటిల్లింది. నాట్లు మునిగిపోవడంతో ఎకరానికి సుమారు రూ.12వేలు నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరలో రామలేరులో జంగిల్ తొలగింపు పనులు చేపట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

**తేరుకుంటున్న వరి పొలాలు**

దెందులూరు: మండలంలో ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు 225 ఎకరాలు నాట్లు ముంపునకు గురయ్యాయని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. శనివారం ఉండ్రాజవరంలో మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 225 ఎకరాల్లో కొంత మేర మాత్రమే పూర్తిగా మునిగాయన్నారు. రెండు రోజులుగా వర్షపునీరు పొలాలు నుంచి దిగువ ప్రాంతానికి వెళ్తుందన్నారు. రెండు రోజుల్లో పూర్తిగా నాట్లకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, రైతుభరోసా కేంద్రం, దెందులూరులో తనను సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు.

# కుట్టు శిక్షణ.. భవితకు భరోసా

- మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ
- గ్రామీణ ప్రాంతాల్లో అతివల అభ్యున్నతికి 'అమ్మ' సంస్థ కృషి



పెదవేగిలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

పెదవేగి: మండలంలోని పెదవేగిలో అమ్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి మహిళలకు ఉపాధి కల్పించాలనే సకల్పంతో ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణను మూడు నెలల పాటు నిర్వహిస్తారు. కుట్టు శిక్షణలో భాగంగా శిక్షకురాలు మహిళలకు పలు డిజైన్లను మహిళలకు నేర్పిస్తున్నారు. అమ్మ అసోసియేషన్ 20 ఏళ్లుగా 28 బ్యాచ్‌లలో వందలాది మంది మహిళలకు సేవాభావంతో ఉచితంగా శిక్షణ ఇచ్చి, వారి అభ్యున్నతికి బంగారు బాటలు వేసింది. ప్రస్తుతం 29వ బ్యాచ్‌కు శిక్షణనిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తరువాత నైపుణ్యం కనబరిచినవారికి కుట్టుమిషన్లు అసోసియేషన్ ద్వారా సబ్సిడీతో అందించనున్నారు. ఏడాదికి రెండు బ్యాచ్‌ల చొప్పున 70 నుంచి వంద మందికి శిక్షణనిస్తారు. శిక్షణ తరగతుల నిర్వహణకు ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి ఒక శిక్షకురాలిని నియమించి శిక్షణనిస్తున్నారు.

### కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన



నేను డిగ్రీ చదివాను. నాకు ఏమి కావాలన్నా భర్తను కాని, తల్లిదండ్రులను కాని అడగాలి. కుట్టు శిక్షణ ద్వారా నైపుణ్యాలు నేర్చుకుని సొంతగా డబ్బులు సంపాదించి ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నాను. కుట్టు శిక్షణ బాగుంది. కొత్త డిజైన్లు నేర్పిస్తున్నారు.

– పి సుధారాణి, కూచింపూడి, కుట్టు శిక్షకురాలు

### ఆర్థికంగా ఎదగాలని..



అమ్మ అసోసియేషన్ అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మిషన్ నేర్చుకుని భవిష్యత్తులో సొంతంగా మా కుటుంబ సభ్యుల దుస్తులు కుట్టుకుంటూ, బయటివారి దుస్తులు కుట్టి, ఎవ్వరి మీద ఆధార పడకుండా ఆర్థికంగా ఎదగాలని అనుకుంటున్నాను. సరికొత్త డిజైన్లతో కుట్టుమిషన్‌లో శిక్షణ ఇస్తున్నారు. – టి మౌనిక, రామశింగవరం, కుట్టు శిక్షకురాలు

### కుటుంబ పోషణకు దోహదం



చెన్నై రాష్ట్రానికి చెందిన పేద కుటుంబం మాది. నా భర్త పెదవేగి దగ్గరలో ఉన్న ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఈ రోజుల్లో కుటుంబంలో ఒక్కరు మాత్రమే పనికి వెళ్లి ఇంటిల్లపాది జీవించాలంటే కష్టం. అందుకే నా వంతు ప్రయత్నంగా కుట్టు శిక్షణ పొంది కుటుంబ పోషణకు దోహదపడతాను.

– ప్రణతిరావు, కుట్టు శిక్షకురాలు

### శిక్షణకు ఆదరణ



గ్రామీణ పేద మహిళల ఆర్థికాభివృద్ధికి ఉచితంగా అందించే కుట్టు శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. సబ్సిడీపై మిషన్‌లు అందించి అమ్మ అసోసియేషన్ మహిళలకు అండగా నిలుస్తోంది. సంస్థ చైర్మన్ చుక్కా అవినాష్ రాజ్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు మంచి స్పందన లభిస్తోంది. మహిళలు ఎంతో ఆసక్తిగా కుట్టు పని నేర్చుకుంటున్నారు. – కె స్వాతి, కుట్టు శిక్షకురాలు

### నేరాల నియంత్రణకు నిత్యం నిఘా

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో నేరాలను నియంత్రణ, రౌడీలు, అసాంఘిక శక్తుల కదలికలపై నిత్యం నిఘా ఉంచుతూ ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు నిర్ణయించారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలో నేరాల కట్టడికి శనివారం వన్‌టౌన్ సర్కిల్ స్టేషన్‌లో వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్, టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్, త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నేరాలకు పాల్పడేందుకు నేరస్తులు భయపడేలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విద్యాసంస్థల వద్ద ఆకతాయిల ఆగడాలను కట్టడి చేస్తామన్నారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటామని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, చోరీల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా, నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు.

# త్యాగానికి, ప్రేమకు ప్రతీక మొహర్రం



దిబ్బగూడెంలో మొహర్రం ప్రాముఖ్యతను వివరిస్తున్న మత గురువు

పెదవేగి : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అందరికీ మంచి జరగాలని దిబ్బగూడెం అబ్దుల్ బిన్ అబ్బాస్ మసీదు ఇమామ్ పఠాన్ సుబానీ నమాజ్ చేశారు. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పెదవేగి మండలంలో వేగివాడ, ముండూరు, రాయన్నపాలెం, న్యాయంపల్లి, దిబ్బగూడెం, ములక్కాయలపాడు, తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దిబ్బగూడెం అబ్దుల్ బిన్ అబ్బాస్ మసీదులో నిర్వహించిన నమాజ్‌లో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుడైన ఇబ్రహీంను పరీక్షించడానికి అతని కుమారుడైన ఇస్మాయిల్‌ను తనకు బలి ఇవ్వాలని కోరగా దేవుని కోరిక మేరకు ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధపడతాడని ఆయన చెప్పారు. తండ్రి, కుమారులు ఇద్దరూ దేవుని ఆజ్ఞను పాటించడంతో సంతృప్తి చెందిన దేవుడు ఆ ఇద్దరినీ దీవించాడని ఆయన తెలిపారు. త్యాగానికి సమానత్వానికి, ప్రేమకు ప్రతీక మొహర్రం అన్నారు. ఈ పండుగ ప్రధాన ఉద్దేశ్యం తనకు ఉన్నదానిలో పేదలకు పంచడమేనని ఆయన వివరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరి నొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ కరీం, షేక్ సలీమ్‌బాషు, పఠాన్ మస్తాన్, ఖాసిం, పఠాన్ అల్లాబక్షు, బాజీ పాల్గొన్నారు.

**ప్రత్యేక నమాజ్‌లు**

పెదపాడు: మండలంలోని పెదపాడు, అప్పనవీడు, వసంతవాడ, తోటగూడెంలో మోహర్రం సందర్భంగా ప్రత్యేక నమాజ్ చేసారు. మహమ్మదీయుల ప్రధాన పర్వదినాల్లో మొహర్రం ముఖ్యమైనది కావడంతో ముస్లిమ్ వీరుల స్మారకార్థం శోక హృదయాలతో ప్రార్థనలు చేశారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ప్రతీకగా హస్తాకృతి కలిగిన రూపాలను తయారు చేసి వాటిని అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా నమాజ్ చేసారు. పలుచోట్ల జరిగిన ఈకార్యక్రమంలో ఇమామ్‌లు పాల్గొన్నారు.

### ఆపద సమయంలో ఆదుకుంటున్న వలంటీర్లు

వలంటీర్లకు వందనం



చొదిమెళ్ల మరియమ్మకు పెన్షన్ నగదు అందజేస్తున్న వలంటీర్ మేరీ

దెందులూరు: ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పేదలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆపద సమయంలో భరోసానిస్తోంది. లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ వారి వద్దకు వలంటీర్లు సొంత ఖర్చులతో వెళ్లి ప్రభుత్వ సాయాన్ని, పింఛన్లను అందిస్తున్నారు. నాగులదేవునిపాడు గ్రామానికి చెందిన చొదిమెళ్ల మరియమ్మ డయాలసిస్ సమస్యతో బాధపడుతూ మంచానికి పరిమితమైంది. గ్రామంలోని వలంటీర్ మేరీ ఆమె వైద్య సేవకు ఎంతో తోడ్పాటునందిస్తున్నారు. బాధితులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛను నగదును అందజేస్తోంది. వలంటీర్ల సేవలను లబ్ధిదారులు, గ్రామస్తులు కొనియాడుతున్నారు.

### సకాలంలో ప్రభుత్వ సాయం



డబ్బులు లేక వైద్యం చేయించుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉండేది. నా ఏరియా వలంటీర్ మేరీ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌ను ఎక్కడా ఉన్న సకాలంలో తీసుకువస్తుంది. వ్యక్తిగతంగా కూడా సహాయ సహకారాలు అందిస్తోంది. వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం అందించే పెన్షన్ ఎంతో ఉపయోగపడుతోంది.

– చొదిమెళ్ల మరియమ్మ, పెన్షనర్, నాగులదేవునిపాడు

# డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు



నారాయణపురం డిగ్రీ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయ్యింది. అరవిందుని 150వ జయంతి సందర్భంగా కళాశాలలో ఆగస్టు 12,13 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. ఈమేరకు సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, కార్యదర్శి సాగిరాజు జానికి రమరాజు, కార్యవర్గ సభ్యులు బొమ్మిడి అప్పారావు, పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ తదితరులు శనివారం మరోమారు సమావేశమైన 50 వసంతాల పండుగను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరావు, అధ్యాపకులు సహకరిస్తున్నారు. ఈ కళాశాలలో చదువుకున్న అనేక మంది దేశ విదేశాల్లో వివిధ వృత్తి, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. మాజీ మంత్రి చింతలపాటి మూర్తిరాజు గ్రామీణ ప్రాంతంలో స్థాపించిన ఈ కళాశాలలో ఎంతోమంది డిగ్రీలు చదువుకుని ఉన్నత విద్యావంతులయ్యారు. పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని, వాళ్ల అడ్రస్సులు తెలిసినవారు ఈ క్రింది నంబరుకు 9346951225కు ఫోన్ చేసి తెలియజేయాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్, ఎమ్మెల్యే వాసుబాబును, ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ఆహ్వానించాలని నిర్ణయించారు. ఆగస్టు 1న మధ్యాహ్నం 4గంటలకు ఎక్కువ మంది పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో మరోమారు సమావేశమయ్యేందుకు నిర్ణయించారు.

# కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా



సీఐటీయూ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

ఉంగుటూరు: విజయవాడలో క్విట్ ఇండియా రోజున నిర్వహించనున్న కార్మికుల మహాధర్నాలో ప్రతి కార్మికుడు పాల్గొని సమస్యల పరిష్కారం కోసం గళమెత్తాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం ఉంగుటూరులో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జి. రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, మతసామరస్యం అంటే ఏమాత్రం ఇష్టంలేని బీజేపీ దేశంలో మతోన్మాదాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తోందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మారణకాండ జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోదీ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఒక శాతం పెట్టుబడిదార్ల కోసం కార్మికుల చట్టాలను కాలరాస్తున్నారని ఉమామహేశ్వరరావు అన్నారు. కార్మిక సంఘాలు ఐక్యంగా తలిపెట్టిన మహాధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాదు, బి సోమయ్య, కె. విజయలక్ష్మి, కె. వెంకట్రావు, సుధాకర్, ఎం. నాగమణి, ఎస్.రాంబాబు, ఆర్‌వీ ఎస్ నారాయణ, ఎస్ కె. సుభాషిణి, వి.సాయిబాబా, ఎస్ అప్పారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణల తొలగింపుపై నిరసన



నారాయణపురం సెంటర్లో ఆక్రమణలను తొలగింపును అడ్డుకున్న ఆక్రమణదార్లు



ఘటనాస్థలానికి వచ్చిన పోలీసులు

ఉంగుటూరు: లోక్ అదాలత్ కోర్టు ఆదేశాల మేరకు ఏలూరు గోదావరి కాలువగట్టున ఉన్న ఆక్రమణలు తొలగించే ప్రయత్నాన్ని ప్రజలు, ఆక్రమణదార్లు అడ్డుకుని నిరసన తెలిపారు. ఇప్పటికి రెండుసార్లు మండలస్థాయి అధికార్లు సమావేశమై ఆక్రమణలు ఈనెల 29న తొలగించాలని నిర్ణయించారు. శనివారం నారాయణపురం సెంటర్లో విద్యుత్ సర్వీసులను తొలగించేందుకు ఏఈ శ్రీరామ్ తన 20 మంది సిబ్బందితో అక్కడికి వెళ్లారు. వీళ్లతోపాటు ఈవోపీఆర్డీ షంషుద్దీన్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్వో, ఇరిగేషన్ తదితర్లు గ్రామస్థాయి అధికార్లు అక్కడకు హాజరయ్యారు. ఆక్రమణదార్లు, వారికి మద్దతుగా కొద్దిమంది ప్రజలు అడ్డురావడంతో విద్యుత్ సరీ్వసులను తొలగించలేకపోయారు. పోలీసులు తగినంతమంది వారు ముందుకు వెళ్లలేదు. సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి ఆక్రమణల వల్ల గోదావరి కాలువ కాలుష్యమవుతోందని లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కై కరంలో గొల్లగూడెం ఏఈ వేణు విద్యుత్ సర్వీసులను తొలగించే ప్రక్రియకు ఆక్రమణదార్ల నుంచి వ్యతిరేకత రావడంతో మిన్నకున్నారు. విద్యుత్ శాఖ అధికార్లు తహసీల్దారుకు జరిగిన పరిస్థితి వివరించి వెళ్లిపోయారు.